క్లుప్తంగా

రేపట్నుంచి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు

దుత్తలూరు: సోమలరేగడలో నూతనంగా నిర్మించిన సీతారామ మందిరంలో విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలను బుధవారం నుంచి మే 4వ తేదీ వరకు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. 30న గంగానయనం, గోపూజ, గణపతి పూజ, పుణ్యాహవచనం, మే 1న ఆదిత్యాది నవగ్రహారాధన, వాస్తుదేవత ఆరాధన, గ్రామబలిహరణ, రుద్ర స్వాహాకార హోమాలు, దీక్షాహోమాలు, 2వ తేదీ నూతన విగ్రహాల గ్రామోత్సవం, చండీహోమం, 3న జప హోమార్చన, 4న గర్తపూజ, యంత్రప్రతిష్ట, విగ్రహ ప్రతిష్ట, గోపుర శిఖర కలశ ప్రతిష్ట, ధ్వజ ప్రతిష్ట, మహాకుంభాభిషేకం నిర్వహించనున్నట్లు వివరించారు.

గ్రావెల్ టిప్పర్లు, జేసీబీ స్వాధీనం



కావలి: రుద్రకోట వద్ద జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి గ్రావెల్‌ను తరలిస్తున్న రెండు టిప్పర్లు, జేసీబీతో పాటు రెండు ఖాళీ టిప్పర్లను పోలీసులు పట్టుకున్నారు. గ్రావెల్ తరలింపుపై టిప్పర్ డ్రైవర్లను ప్రశ్నించగా సరిగా సమాధానం చెప్పక పోవడంతో వాహనాలను స్వాధీనం చేసుకుని రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ విషయమై కావలి రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జీ రాజేశ్వరరావును సంప్రదించగా విచారిస్తున్నామని తెలిపారు.

ఆశీర్వచనం



కలిగిరి: మండలంలోని కృష్ణారెడ్డిపాళెంలో సోమవారం జరిగిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు రావుల లక్ష్మీనారాయణరెడ్డి కుమార్తె జాహ్నవి వివాహ వేడుకలో ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు. వధువు జాహ్నవిని ఆశీర్వదించారు. అనంతరం స్థానిక నాయకులు, ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. జెడ్పీటీసీ పాలూరు మాల్యాద్రిరెడ్డి, కలిగిరి, దుత్తలూరు, వరికుంటపాడు మండలాల కన్వీనర్లు కాటం రవీంద్రారెడ్డి, వాసుదేవరెడ్డి, తిరుపతినాయుడు, ఏఎంసీ మాజీ చైర్మన్ ఆలీఅహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

రేపు వీఆర్‌ఏల నిరసన

ఉదయగిరి: ఏపీ వీఆర్‌ఏల అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు తమ న్యాయపరమైన దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 30న మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లుగా ఆ సంఘ మండల నాయకుడు ఆర్ దుగ్గయ్య తెలిపారు. ఈ మేరకు తహసీల్దార్ సుభద్రకు వీఆర్‌ఏలు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వీఆర్‌ఏలు మాట్లాడుతూ రెవెన్యూ వ్యవస్థలో ఎన్నో ఏళ్ల నుంచి పనిచేస్తున్నామని తెలిపారు. చాలీచాలని వేతనాలతో కుటుంబాలను పోషించుకోలేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. తమ వేతనాలను పెంచడంతో పాటు ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

పరామర్శ



కావలి: పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు దామిశెట్టి శ్రీనివాసనాయుడు కుటుంబసభ్యులను మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సోమవారం పరామర్శించారు. ఇటీవల దామిశెట్టి శ్రీనివాసనాయుడు మరణించిన నేపథ్యంలో ఆయన చిత్రపటానికి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డితో కలిసి మంత్రి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

మునుగోడు: తెలంగాణ రాష్ట్రం నల్లగొండ జిల్లా మునుగోడు మండలం కల్వలపల్లి గ్రామంలో ఓ వ్యక్తి అనుమానస్పద స్థితిలో మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. వివరాలు.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నెల్లూరు జిల్లా ఆత్మకూరు మండలం కరటంపాడు గ్రామానికి చెందిన పత్తిపాటి హజరత్(40) ఇరవై ఏళ్ల క్రితం ఉపాధి నిమిత్తం మునుగోడు మండలం కల్వలపల్లి గ్రామానికి వలస వచ్చాడు. అదే గ్రామానికి చెందిన కంభంపాటి లక్ష్మమ్మను 18 ఏళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. స్థానికంగానే నివాసం ఉంటూ తాపీమేస్త్రీగా పనిచేస్తున్నాడు. శనివారం ఇంటి నుంచి బయటకు వెళ్లిన హజరత్ తిరిగి రాలేదు. అతడి కోసం కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. కాగా ఆదివారం కల్వలపల్లి గ్రామ శివారులోని ముత్యాలమ్మ దేవాలయ సమీపంలో హజరత్ విగతజీవిగా కనిపించాడు. హజరత్ మృతి పట్ల అనుమానం వ్యక్తం చేస్తూ అతడి తల్లి పత్తిపాటి ఈరమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవి తెలిపారు.

దేవుడికే శఠగోపం

- దేవుడి మాన్యాల కౌలు వేలంలో నిబంధనలకు తిలోదకాలు
- పేపర్ ప్రకటన ఇవ్వకుండా..దండోరా వేయించకుండా హడావిడిగా నిర్వహణ
- డిపాజిట్లు కట్టించుకోకుండానే పాతవారికే తక్కువ కౌలుకు అప్పగింత
- దేవదాయశాఖ అధికారుల తీరుపై విమర్శలు వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు



దేవస్థానం భూముల వేలం నిర్వహిస్తున్న దేవదాయ శాఖ అధికారులు (ఫైల్)

ఆత్మకూరు(చేజర్ల): చేజర్ల మండలంలోని దేవుడి మాన్యాలకు సంబంధించిన కౌలువేలం నిర్వహణలో దేవదాయశాఖ అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. దేవదాయశాఖ నిబంధనలను తుంగలో తొక్కి తూతూ మంత్రంగా వేలం నిర్వహించి తక్కువ కౌలుకు పాతవారికే భూములను అప్పగిస్తున్నారు. తద్వారా దేవుడి ఆదాయానికి గండికొడుతున్నారు. చిత్తలూరులోని పురాతన చెన్నకేశవస్వామి, వీరభద్రస్వామి ఆలయాలు ఉన్నాయి. ఈ ఆలయాల నిర్వహణకు దశాబ్దాల క్రితం చిత్తలూరు, ఆదూరుపల్లి, దొరువుపాళెం, వావిలేరు, తదితర గ్రామాలకు చెందిన పలువురు దాతలు 102 ఎకరాల భూములను విరాళంగా అందజేసి ఉన్నారు. సదరు భూముల వేలం ద్వారా వచ్చే ఆదాయంతో దేవస్థానాల నిర్వహణ, అర్చకులకు జీతభత్యాలు చెల్లించడం ఆనవాయితీగా వస్తోంది. అయితే కొన్నేళ్లుగా కొందరు దేవదాయశాఖ అధికారులను లోబర్చుకుని తక్కువ కౌలుకు భూములను దక్కించుకుంటూ దేవుడి ఆదాయానికి గండికొడుతున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. దీంతో రెండు దేవాలయాల్లో పని చేస్తున్న అర్చకులకు గత కొన్ని నెలలుగా జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. గతంలో భూములు పాడుకున్న వారి కాలపరిమితి పూర్తయినా దేవదాయశాఖ అధికారులు వేలంపాటలు నిర్వహించకపోవడంతో పాతవారే సాగు చేసుకుంటున్నారు. ఈ విషయమై గ్రామస్తులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా స్పందించి వెంటనే వేలం నిర్వహించాలని దేవదాయశాఖ అధికారులను ఆదేశించారు. దీంతో దేవదాయశాఖ అధికారులు రెండు రోజుల క్రితం హడావిడిగా వేలంపాటలు నిర్వహించారు. దేవదాయ శాఖ నిబంధనల మేరకు వారం రోజులు ముందుగా దేవుడి మాన్యం భూములు ఉన్న గ్రామంలో దండోర వేయించడం, పేపర్ ప్రకటన ఇవ్వాలి. కానీ ఇవేమి చేయకుండానే కేవలం చిత్తలూరులో మాత్రమే ఒక్కపూట దండోర వేయించి శనివారం హడావిడిగా వేలం పాట నిర్వహించారని గ్రామస్తులు చెబుతున్నారు. వేలం పాటలో పాల్గొనే వారి నుంచి డిపాజిట్లు కట్టించుకోవాలి. కానీ కట్టించుకోకుండానే వేలంపాట నిర్వహించి పాతవారికే కట్టబెట్టారని వారు ఆరోపిస్తున్నారు. డిపాజిట్ నగదు సైతం పదిహేను రోజుల తరువాత కట్టవచ్చునని వేలంలో భూములను దక్కించుకున్న వారికి అవకాశం కల్పించడంపై దేవదాయశాఖ అధికారులు లాలూచిపడ్డారనే అనుమానాలను గ్రామస్తులు వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని దేవదాయశాఖ ఉన్నతాధికారులు పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. కాగా ఈ విషయమై గ్రామానికి చెందిన ఎడ్లపల్లి శ్రీనివాసులు నాయుడు, కూరపాటి భక్తవత్సలబాబు, తెల్లపాటి వెంకట కృష్ణయ్య, పరుచూరి శివయ్య, తదితరులు సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. దేవదాయశాఖ అధికారుల తీరుపై ఆరోపణలు చేశారు. ఈ విషయమై దేవదాయ శాఖ అధికారులను సంప్రదించేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

జరిగింది ఒకలా, కేసు మరోలా

ఆత్మకూరు: ఆత్మకూరు పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకుడు షేక్ రహీంను ఆదివారం కేసు నమోదు చేసి అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. దర్గా కమిటీ ఏర్పాటు, వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించేందుకు వెంటనే అనుమతులు రాకపోవడంతో ఆ విషయాలపై రహీం బీఎస్సార్ సెంటర్‌లో పిచ్చాపాటిగా కొందరితో వ్యాఖ్యానాలు చేశాడు. దీనిని వీడియో తీసి కొందరు మంత్రి ఆనంకు పంపారు. దీంతో ఆత్మకూరు సీఐ, ఎస్సైలు రంగంలోకి దిగి రహీంపై కేసు నమోదు చేశారు. కానీ ఎఫ్‌ఐఆర్‌లో మరోలా నమోదు చేసినట్లు సమాచారం. టీడీపీ చెందిన ఓ కార్యకర్త మెడలోని బంగారు చైనును దౌర్జన్యంగా లాక్కెళ్లాడని, అతనిపై దాడి చేశాడని సదరు వ్యక్తి ఫిర్యాదు చేసినట్లుగా కేసు నమోదు చేశారు. ఈ విషయమై ఎస్సై జిలానీని సంప్రదించగా టీడీపీ కార్యకర్త ఫిర్యాదు మేరకే ఎఫ్‌ఐఆర్ నమోదు చేసి కోర్టుకు హాజరుపరచగా రిమాండ్ విధించిందని తెలిపారు. కాగా ఈ విషయమై పట్టణానికి చెందిన పలువురు ఇది అన్యాయమని, జరిగింది ఒకటికాగా, కేసు మరోలా నమోదు చేయడం సరికాదని మండిపడుతున్నారు.

తలసేమియా డే కేర్ సెంటర్ సందర్శన



తలసేమియా బాధిత చిన్నారి తండ్రికి మందులు, పౌష్టికాహారం అందజేస్తున్న ఆర్డీఓ వంశీకృష్ణ

కావలి : పట్టణంలోని తలసేమియా డే కేర్ సెంటర్‌ను ఆర్డీఓ ఎం సన్నీవంశీకృష్ణ సోమవారం సందర్శించారు. ప్రకాశం జిల్లా పుల్లలచెరువుకు చెందిన తలసేమియా బాధిత చిన్నారులు ఏసోబు, మహేష్‌ను పరామర్శించారు. వారికి అందిస్తున్న వైద్యసేవలను ఆర్డీఓకు వైద్యులు రమ్య, శ్రీధర్ వివరించారు.తలసేమియా బాధితులకు ఉచితంగా వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యులు వీ గోపి, పీ శ్రీధర్‌ను ఆర్డీఓ అభినందించారు. అనంతరం తలసేమియా బాధిత చిన్నారుల తండ్రి మరియదాసుకు మందులు, పౌష్టికాహారం అందజేశారు. అనంతరం ఆర్డీఓ మాట్లాడుతూ తలసేమియా బాధితులు సదరం సర్టిఫికెట్ పొందితే ఆర్టీసీ దివ్యాంగులకు ఇచ్చే రాయితీ బస్సు పాసులను ఇప్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

వేసవి విపత్తులపై అప్రమత్తంగా ఉండాలి



చలివేంద్రం ప్రారంభించిన ఆర్డీఓ వంశీకృష్ణ

కావలి: వేసవి విపత్తులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కావలి ఆర్డీఓ సన్నీవంశీకృష్ణ అన్నారు. పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో రెడ్‌క్రాస్ కావలి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించి మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకుని ఆర్డీఓ కార్యాలయానికి వచ్చే వారి దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ప్రారంభించామని తెలిపారు. ఇప్పటికే రెడ్‌క్రాస్ ద్వారా ఆర్టీసీ బస్టాండ్‌లో చలివేంద్రాన్ని ప్రారంభించామని చెప్పారు. వేసవిలో వడదెబ్బకు గురికాకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎండలో ఎక్కువగా తిరుగకూడదని, బయట తిరగాల్సి వస్తే తలకు నీడ ఉండేలా గొడుగు, టోపీ లేదా తువ్వాలు ధరించి బయటకు రావాలని సూచించారు. వడదెబ్బపై ప్రజలకు అవగాహన కలిగించేందుకు రెడ్‌క్రాస్ ద్వారా దృశ్య, శ్రవణ వాట్సప్ క్లిప్పింగ్‌ను ప్రత్యేకంగా తయారు చేయించి అన్ని గ్రూపులకు పంపుతున్నామని తెలిపారు. మే నెలలో ఈదురు గాలులతో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెడ్‌క్రాస్ పాలకమండలి సభ్యుడు కలికి శ్రీహరిరెడ్డి, కావలి శాఖ ఉపాధ్యక్షుడు బెజవాడ రవికుమార్, చైర్మన్ డీ రవిప్రకాష్, వైస్‌చైర్మన్ కే హరినారపరెడ్డి, పాలకమండలి సభ్యులు ఓరుగంటి వెంకటేశ్వర్లు, బీద లక్ష్మీనంద, నల్లిపోగు ప్రణీత్, బెజవాడ ప్రసన్నకుమార్, డాక్టర్ రమ్య, కల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

కారు అదుపు తప్పి ఒకరికి గాయాలు



మర్రిపాడు: కారు అదుపుతప్పి ప్రహరీని ఢీకొనడంతో ఒకరు గాయపడ్డారు. ఈ ఘటన నందవరం చెరువు కట్ట వద్ద నెల్లూరు–ముంబయి జాతీయ రహదారిపై సోమవారం చోటు చేసుకుంది. వివరాలు..నెల్లూరు నుంచి బద్వేలు వైపు ఐదుగురు ప్రయాణికులతో వెళ్తున్న కారు నందవరం చెరువు కట్ట వద్ద అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న వాటర ట్యాంక్ ప్రహరీని ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు నుజ్జునుజ్జు కాగా అందులో ప్రయాణిస్తున్న ఒకరు గాయపడ్డారు. మర్రిపాడు ఎస్సై శ్రీనివాసరావు తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడ్ని ఆత్మకూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా వాటర్ ట్యాంక్ పక్కన ఉన్న వాటర్ ప్లాంట్ వద్ద మంచినీటి కోసం వచ్చే వారు ఎప్పుడూ ఉంటారు. ప్రమాద సమయంలో ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పిందని అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

ఎన్‌ఎంయూ రిలే దీక్షలు



ఉదయగిరి/ ఆత్మకూరురూరల్: ఉదయగిరి ఆర్టీసీ డిపో ఆవరణలో నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కార్మికులు రిలేనిరాహార దీక్షలను సోమవారం ప్రారంభించారు. యూనియన్ గౌరవాధ్యక్షుడు షేక్ రియాజ్ రిలేదీక్షలను ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కార్మికుల రిలేదీక్షలను ప్రారంభించినట్లుగా తెలిపారు. కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. జోనల్ నాయకుడు సలాం, డిపో అధ్యక్షుడు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గ్యారేజీలోని సమస్యలను పరిష్కరించాలని, మహిళా ఉద్యోగులకు పిల్లల సంరక్షణ సెలవులు మంజూరు చేయాలన్నారు. ప్రమోషన్లు ఇవ్వాలని, ఖాళీలు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఆత్మకూరు ఆర్టీసీ డిపో ఎదుట ఎన్‌ఎంయూ ఆధ్వర్యంలో కార్మికులు రిలేదీక్షలు ప్రారంభించారు. ఆత్మకూరు నాయకులు పద్మారావు, మస్తానయ్య, ఉదయగిరి నాయకులు శంకర్, శ్రీధర్, వీకే మూర్తి, బాషా, కేఎం కొండయ్య పాల్గొన్నారు.

నోషనల్ ఖాతాల మార్పునకు స్పెషల్ డ్రైవ్

మర్రిపాడు: మండల రెవెన్యూ రికార్డుల్లో నోషనల్ ఖాతాలుగా నమోదై ఉన్న భూములను రెగ్యులర్ ఖాతాలుగా మార్చేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ అనిల్‌కుమార్‌యాదవ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నోషనల్ ఖాతాలు కలిగిన రైతుల జాబితాలను సచివాలయాల్లో పొందుపరిచామని చెప్పారు. జాబితాలోని రైతులు తమకు భూమి ఏ విధంగా సంక్రమించిందో తెలియజేస్తూ అందుకు సంబంధించిన పత్రాల నకళ్లతో కూడిన అర్జీలను వీఆర్వోలకు అందజేయాలని సూచించారు. విచారణ జరిపి ఆక్షేపణలు లేని నోషనల్ ఖాతాలను రెగ్యులర్ చేస్తామని తెలిపారు.

గ్రీవెన్స్‌కు హాజరుకాని అధికారులకు మెమోలు

దుత్తలూరు: ప్రజాసమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్)కు హాజరుకాని అధికారులకు మెమోలు జారీచేస్తామని తహసీల్దార్ యనమల నాగరాజు తెలిపారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో ప్రజాసమస్యలపై అర్జీలు స్వీకరించారు. దుత్తలూరు ఏఏ కాలనీవాసులు భూసమస్యపై అర్జీ అందజేశారు.

నీటితీరువా వసూళ్లపై దృష్టి సారించాలి



వింజమూరు(ఉదయగిరి): నీటితీరువా వసూళ్లపై వీఆర్వోలు ప్రత్యేక దృష్టి సారించాలని వింజమూరు తహసీల్దార్ ఎస్డీ హమీద్ అన్నారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో నీటితీరువా వసూళ్లపై వీఆర్వోలతో సమీక్షించారు. వింజమూరు, రాగిపాడు, చంద్రపడియ చెరువులకు సంబంధించి నీటితీరువా బకాయిలు రూ.1.18 లక్షలు ఉందని, వెంటనే వసూలు చేయాలని వీఆర్వోలను ఆదేశించారు. అలాగే నోషనల్ ఖాతాలను రెగ్యులర్ ఖాతాలుగా మార్పు చేయించుకునేలా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు.

పాలిసెట్ పరీక్షకు సర్వం సిద్ధం

కావలి: కావలిలో బుధవారం నిర్వహించనున్న పాలిసెట్ పరీక్షకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు కావలి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్, పాలిసెట్ కోఆర్డినేటర్ ఏ సుశీల్‌కుమార్‌ప్రియ సోమవారం తెలిపారు. విట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో 297 మంది, రుద్రకోటలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 299 మంది పరీక్షకు హాజరుకానున్నారని చెప్పారు. అందకనుగుణంగా అన్ని వసతులు కల్పించామని తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష జరుగుతుందని చెప్పారు. పరీక్ష కేంద్రంలోకి ఉదయం 10 గంటల నుంచి హాల్‌టికెట్ కలిగిన అభ్యర్థులను మాత్రమే అనుమతిస్తామని తెలిపారు. పరీక్షకు ఒక నిమిషం ఆలస్యమైనా పరీక్షకు అనుమతించమని స్పష్టం చేశారు. అందువల్ల అభ్యర్థులందరూ ముందుగానే సెంటర్‌కు చేరుకోవాలని సూచించారు.

పొగాకు గరిష్ట ధర రూ.280

మర్రిపాడు: డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో సోమవారం కిలో పొగాకు గరిష్ట ధర రూ.280 పలికింది. వేలానికి 895 బేళ్లు రాగా, 707 పొగాకు బేళ్లను కొనుగోలు చేశారని వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు.వేలంలో కిలో పొగాకు గరిష్టంగా రూ.280, కనిష్టంగా రూ.210, సగటున రూ.254.74 ధర పలికిందని వివరించారు.

కలిగిరి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో కిలో పొగాకు గరిష్ట ధర రూ. 280 పలికింది. వేలానికి జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 516 బేళ్లను తీసుకురాగా, 413 బేళ్లను కొనుగోలు చేసినట్లు వేలం నిర్వహణాధికారి నివేశ్‌కుమార్‌పాండే తెలిపారు. వేలంలో కిలో పొగాకు గరిష్టంగా రూ. 280, కనిష్టంగా రూ. 210, సరాసరిన రూ.259.84 ధర పలికిందని వివరించారు.

ఎంఈఓకు వినతి

అనుమసముద్రంపేట:జమ్మవరంలోని ప్రాథమికోన్నత పాఠశాలను యథాతదంగా కొనసాగించాలని మండల యూటీఎఫ్ నాయకులు కోరారు. ఈ మేరకు ఎంఈఓకు సోమవారం వినతిపత్రం అందజేశారు. జమ్మవరం పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి వరకు 60 మంది, 6 నుంచి 8వ తరగతి వరకు 62 మంది విద్యార్థులు ఉన్నారని తెలిపారు. గ్రామానికి హైస్కూల్ సుమారు ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్నందున పాఠశాలను యథాతదంగా కొనసాగించాలని కోరారు.

భూసార పరీక్షలపై అవగాహన



వరికుంటపాడు: మండలంలోని తిమ్మారెడ్డిపల్లి రైతుసేవా కేంద్రంలో భూసార పరీక్షలు, ప్రత్యామ్నాయ పంటల సాగుపై ఏఓ రవికుమార్ సోమవారం కల్పించారు. భూసార పరీక్షలకు అనుగుణంగా పంటలు సాగుచేసుకుంటే అధిక దిగుబడులు పొందవచ్చని తెలిపారు. ఎరువుల పెట్టుబడులను తగ్గించుకోవచ్చని చెప్పారు. 50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలను అందజేస్తున్నట్లు తెలిపారు. రైతుసేవా కేంద్రాల్లో నగదు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. వీఏఏ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కోడిపందేల స్థావరంపై దాడి

అల్లూరు: మండలంలోని పురిణి సమీపంలో పైడేరు గట్టుపై సోమవారం కోడిపందేలు నిర్వహిస్తున్నారనే సమాచారంతో ఎస్సై కిషోర్‌బాబు తన సిబ్బందితో దాడులు నిర్వహించారు. ఈ దాడులో ఐదుగురు జూదరులను పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ 3200, కోడి పుంజు, 5 బైకులు, స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నూరు శాతం లక్ష్యాలు సాధించాలి



ఆరోగ్య కార్యకర్తలకు యూనిఫామ్ పంపిణీ

ఉదయగిరి: ఆరోగ్య, ఆశాకార్యకర్తలు వైద్యారోగ్యశాఖ నిర్దేశించిన లక్ష్యాలను నూరు శాతం సాధించాలని వైద్యాధికారిణి వినీత అన్నారు. స్థానిక పాత సీహెచ్‌సీ భవనంలో గండిపాళెం పీహెచ్‌సీకి చెందిన వైద్యారోగ్య సిబ్బందితో సెక్టార్ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్‌సీడీ సర్వేను బాధ్యతగా ఇంటింటికి తిరిగి నిర్వహించాలన్నారు. వేసవిలో వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వెల్‌నెస్ సెంటర్లలో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. అనంతరం ఆరోగ్య కార్యకర్తలకు యూనిఫామ్ అందజేశారు. సీహెచ్‌ఓ శివకుమారి, ఆరోగ్య బోధకుడు కలసపాటి వెంకటసుబ్బయ్య, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌లో పోలీసుల తనిఖీలు



ప్రయాణికులకు అవగాహన కల్పిస్తూ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న పోలీసులు

కావలి: కావలి రైల్వేస్టేషన్‌లో నెల్లూరు రైల్వే సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో ఎస్సైలు పోలీస్ సిబ్బందితో కలిసి ఆదివారం రాత్రి తనిఖీలు చేపట్టారు. రైల్వే స్టేషన్‌లోని ప్రయాణికుల బ్యాగులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనుమానాస్పద వ్యక్తుల వేలిముద్రలను సేకరించారు. అనంతరం రైల్వే ప్రయాణికుల భద్రత విషయంలో అప్రమత్తంగా ఉన్నామని తెలియజేస్తూ ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా కావలి జీఆర్‌పీ ఎస్సై రమాదేవి మాట్లాడుతూ కాశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడుల నేపథ్యంలో రైల్వే స్టేషన్‌లో విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. రైల్వే స్టేషన్లు, రైళ్లలో అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు కనిపించిన వెంటనే తమకు సమాచారం అందించాలని ప్రయాణికులకు సూచించారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి



ఆత్మకూరురూరల్: మహిమలూరులో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ర్యాలీ

వింజమూరు(ఉదయగిరి): రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని ప్రకృతి వ్యవసాయ డివిజనల్ అధికారి అంజిరెడ్డి అన్నారు. వింజమూరులోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ప్రకృతి వ్యవసాయంపై సోమవారం రైతులకు అవగాహన కల్పించారు. వివిధ రకాల ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి విధానంలో 20 సెంట్ల విస్తీర్ణంలో 20 రకాల కూరగాయలు ఎలా పండించవచ్చో అవగాహన కల్పించారు. ప్రకృతి విధానంలో పండించిన పంట ఉత్పత్తులు వాడడం వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చని తెలిపారు. ప్రతి సోమవారం వింజమూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంట ఉత్పత్తులను విక్రయిస్తామని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ సహాయకులు కుమారి, స్వప్న, వేదవతి, అనూష, మాల్యాద్రి, మహేంద్ర, వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరురూరల్: మహిమలూరులో సర్పంచ్ పట్టెడ చంద్రశేఖర్ అధ్యక్షతన ప్రకృతి వ్యవసాయం ఖరీఫ్ కార్యాచరణ ప్రణాళికపై గ్రామసభను సోమవారం నిర్వహించారు. ఉత్తమ ఆదర్శ రైతులను సన్మానించారు. అనంతరం గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై ప్లకార్డులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు.

అభాగ్యులకు ఆశ్రయం కల్పించడం అభినందనీయం



గుప్తాకు నివాళులర్పిస్తున్న ఎంపీపీ పద్మావతి

సీతారామపురం : బసినేనిపల్లిలోని మంచికంటి సుబ్బరామప్రసాద్‌గుప్తా అనాథ ఆశ్రమంలో ఆ ఆశ్రమ వ్యవస్థాపకుడు సుబ్బరామప్రసాద్‌గుప్తా వర్ధంతి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఎంపీపీ చింతంరెడ్డి పద్మావతి పాల్గొని ప్రసాద్ గుప్తా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ బసినేనిపల్లికి చెందిన సుబ్బరామప్రసాద్ గుప్తా వ్యాపారరీత్యా కర్నూలులో స్థిరపడిన సొంత ఊరిపై ఉన్న మమకారంతో కోట్లాది రూపాయలు ఖర్చుపెట్టి అనాథాశ్రమాన్ని ఏర్పాటుచేసి అభాగ్యులకు ఆశ్రయం కల్పించడం అభినందనీయమన్నారు. గుప్తా కుటుంబాన్ని ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం అన్నదానం చేశారు. మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ చింతంరెడ్డి సుబ్బారెడ్డి, అయ్యవారిపల్లి సర్పంచ్ దుర్గాప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాలకొలను వెంకటరెడ్డి, లోకేష్‌రెడ్డి, బాలినేని మాబయ్య, నూతన్, ఖాసీంపీరా, ఖాజావలీ, సతీష్ మహేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

అల్లుకున్న నిర్లక్ష్యం



వింజమూరు పంచాయతీ పరిధిలోని జీబీకేఆర్ ఎస్టీకాలనీ సమీపంలోని ఓ విద్యుత్ స్తంభానికి పిచ్చి తీగలు పూర్తిగా అల్లుకుపోయాయి. విద్యుత్ సిబ్బంది తీగలను తొలగించడంలో నిర్లక్ష్యం వహించడంతో కింది నుంచి పై వరకు స్తంభం కనిపించని విధంగా దట్టంగా అల్లుకున్నాయి. విద్యుత్ తీగలను సైతం ఆక్రమిస్తున్నాయి. దీంతో గాలులు వీచినప్పుడు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడే అవకాశం ఉంది. విద్యుత్ అధికారులు స్పందించి పిచ్చితీగలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

– వింజమూరు(ఉదయగిరి)